



న్యూస్ బాక్స్

జన్నారం మార్కెట్ కమిటీ కార్యవర్గం నియామకం



చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ
వైస్ చైర్మన్ సయ్యద్ పసివుల్లా

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌గా పొనకల్ గ్రామానికి చెందిన సయ్యద్ పసివుల్లాలను నియమించారు. సభ్యులుగా ఎల్ల లావణ్య, లకావత్ తిరుపతి, పూనం సోనేరావు, పులిశెట్టి లావణ్య, అంబడిపల్లి నర్సయ్య, రేగుంట ప్రదీప్, ముత్యం రాజన్న, బెడద సత్తయ్య, గర్వదుల సత్యగౌడ్, బెనవేరి రాజన్నలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో రాకపోకలపై ఆంక్షలు

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం కోర్ ఏరియాలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అన్ని వాహనాలను రాత్రి 9 దాటితే అనుమతించకూడదని ఎస్‌బీడబ్ల్యూ ఆదేశాలు జారీ చేసినట్లు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆర్టీసీ బస్సు, అంబులెన్స్ మినహా అన్ని వాహనాలకు వర్తిస్తుందన్నారు. తపాలపూర్ చెక్‌పోస్టు నుంచి నిర్మల్ జిల్లాలోని పాండువాపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని కొత్తగూడ చెక్‌పోస్టులు మూసివేస్తామని, మూడు జిల్లాల అధికారులకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. రాత్రి వన్యప్రాణులు రహదారులపైకి వస్తాయని, పులులు కూడా సంచరిస్తున్నాయని తెలిపారు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 6న ఉదయం 4 గంటలకు మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తిరాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించే యువజన ఉత్సవాలకు హాజరు కావాలని తెలిపారు. 9963539234లో సంప్రదించాలన్నారు.

ఆదివారం అమ్మకు తోడుగా...

- చిన్నారులకు పనులు నేర్పుదాం
- 3 నుంచి 5వ తరగతిలో పాఠ్యాంశం

7



ప్రకృతి పరవశం.. సీతాకోకచిలుకలు

- పెంచికలపేట అడవుల్లో శీతాకాలంలో విరివిగా దర్శనం
- సుమారు 50కి పైగా రకాల సీతాకోకచిలుకలు
- మొక్కల పరాగసంపర్కంలో వీటిదే ప్రముఖపాత్ర

6



వేగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



- జిల్లాలో 2.5 లక్షల దరఖాస్తులు
- 1.79 లక్షల ఇళ్ల సర్వే పూర్తి
- ప్రత్యేక యాప్ ద్వారా అనర్హుల గుర్తింపు
- స్థలాలు ఉన్నవారికి రెండో విడుతలో మంజూరు

మంచిర్యాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతిళ్ల కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకుగానూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహిళల పేరిట దరఖాస్తులు స్వీకరించింది. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందకుండా, అర్హులకు లబ్ధి జరిగేలా ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేకయాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీంతో పది రోజులుగా సిబ్బంది జిల్లాలోని దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. సర్వే సిబ్బంది దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల ఫొటోలు తీసుకుంటున్నారు. దీంతోపాటు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, ఇల్లు నిర్మించుకునేందుకు భూమి అందుబాటులో ఉందా? లేదా? స్థలం ఉంటే ఎవరిపేరిట ఉంది, ఇంట్లో ఉన్న వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుతం అక్కడ ఎన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు,

లబ్ధిదారు దివ్యాంగులా, అనాథలా, ఒంటరి మహిళా, వితంతువా, ట్రాన్స్‌జెండర్లు, పారిశుధ్య కార్మికులు వంటివాటిని యాప్ ద్వారానే గుర్తించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఆయా విభాగాల వారికే ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ప్రతీ మండలంలో నమూనా ఇంటి నిర్మాణం చేపట్టి, దాని ప్రకారంగానే ఇళ్ల నిర్మాణం ఉంటుందని అధికారులు ప్రజలకు చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. నమూనాఇళ్ల నిర్మాణాన్ని ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

వివరాలు యాప్‌లో నమోదు...

ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా ఇళ్ల సర్వే చేస్తున్న సిబ్బంది మహిళల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. గెజిటెడ్ స్థాయి అధికారి సర్వేను పరిశీలించనున్నారు. ప్రజాపాలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకోసం 2 లక్షల 5వేల 939 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 1,79,719 దరఖాస్తులను పరిశీలించగా, వివరాలను వెంట వెంటనే సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మొదట్లో కొంత సర్వే నత్తనడకన సాగగా, ప్రస్తుతం వేగం పుంజుకుంది. 20 రోజులుగా మండలాలు, మున్సిపాలిటీల్లో సర్వే చేపడుతుండగా, లక్ష్యాన్ని చేరుకునే దిశగా సర్వే సాగుతోంది. మున్సిపాలిటీల్లో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండగా కొంత ఆలస్యం అవుతోంది. అయితే వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారనే విషయాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదించేం దుకు అధికారులు సన్నద్ధమవు తున్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి దరఖా స్తుదారులు సంబంధిత ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచి, అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానం చెబితే సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, ఇందుకు దరఖాస్తుదారులు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. సిబ్బందికి సహకరించి సరైన వివరాలు అందిస్తే సర్వేప్రక్రియ త్వరగా పూర్తి కావడంతోపాటు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వెసులు బాటు కలుగుతుందని తెలిపారు. త్వరితగతిన సర్వే పూర్తిచేసి మొదటి దశ లో అత్యంత పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్వే అనంతరం జాబితాను ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ..

మిగతా 7లో

మంచిర్యాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా



మార్కెట్ ఏరియాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి చేసి మంచిర్యాలను సర్వాంగ సుందరంగా మారుస్తానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని మహా ప్రస్థాన నిర్మాణ పనులను, మార్కెట్ ఏరియాలో రోడ్డు వెడల్పు కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని మూడు సంవత్సరాల్లో యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి మాటను నిలబెట్టుకుంటానన్నారు. శివరాత్రి పండుగ లోపు మహాప్రస్థాన నిర్మాణం, మాతా శిశు ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సెల్లార్ తవ్వకాలు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, రాళ్లవాగు ఇరువైపులా కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యాపారస్థులకు ఇబ్బందులు కలగకుండా పనులు జరిపించాలన్నారు. అండర్ గ్రౌండ్ పనులను పైలట్ ప్రాజెక్టు కింద చేపడతామని అన్నారు. మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారితే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలుపుతానన్నారు. సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తన ఆరోగ్యంపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారంపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ మారుతిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, మజూద్ ఆలీ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

- ముత్యాల ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కేంద్రంలో ముస్తాబైన అభ్యాస స్కూల్



ముగ్గుల పోటీల వేదిక అభ్యాస స్కూల్

మంచిర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల వంతెన సమీపంలో గల ఆదిత్య ఎన్‌క్లేవ్‌లోని 'అభ్యాస స్కూల్' పోటీలు జరగనున్నాయి. 'ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)... సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తోంది. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేల నగదుతోపాటు పోటీల్లో పాల్గొనే అందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. పోటీలు ఉదయం 10నుంచి 12గంటల వరకు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 9.30 గంటల వరకు వేదిక వద్ద చేరుకొని పేర్లను నమోదు చేసుకోవాలి. మహిళలు, యువతులు, విద్యార్థినులు పాల్గొని చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. పోటీదారులు ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలో చెప్పగలగాలి. ముగ్గుల్లో సంక్రాంతి నేపథ్యం, సంస్కృతి, సంప్ర దాయాలు ప్రతిబింబించే అంశాలతోపాటు ఇతర సామాజిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పోటీలకు హాజరయ్యే మహిళలు అవసరమైన రంగులు, ఇతర పరికరాలు వెంట తెచ్చుకోవాలి. ముగ్గు ఒక్కరు మాత్రమే వేయాలి. సహాయం కోసం మరొకరిని అందుబాటులో ఉంచుకొనే వెసులుబాటు ఉంది.

పోటీల స్పాన్సర్లు వీరే....

ముగ్గుల పోటీలకు స్పాన్సర్లుగా ప్రథమ బహుమతి మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ నీలకంఠేశ్వరరావు (చార్వాక చారిటబుల్ ట్రస్ట్), ద్వితీయ బహుమతి డాక్టర్ రుద్రభట్ల రఘువంశీ (అవని చిల్డ్రన్స్ హాస్పిటల్), తృతీయ బహుమతి సాన సుధతి (అభ్యాస స్కూల్ ప్రిన్సిపాల్), కన్సొలేషన్ బహుమతులు పత్తి వెంకటేష్ (ప్రముఖ వస్త్ర వ్యాపారి), డాక్టర్ బుద్ద ప్రవీణ్ (ప్రవీణ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్)లు వ్యవహరించనున్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గూడెం ఎత్తిపోతల పథకం కింద యాసంగి పంట చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, చీఫ్ ఇంజనీర్ బద్రినారాయణ, డీఈ దశరధంలతో కలిసి రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి విడుదలలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాసంగి పంటకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసే నీటిని పద్ధతిగా వినియోగించుకోవాలన్నారు. సాగునీటిని విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని, నీటి విడుదల చేసే వివరాలను రైతులకు తెలుపాలన్నారు. యాసంగిలో గూడెం ఎత్తిపోతల పథకం కింద 69 వేల ఎకరాలు ఆయకట్టు సాగువుతుందన్నారు. ఏఈఈలు జాకీర్, రాజేందర్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, పోలీసు, రవాణా అధికారులతో మాట్లాడారు. ఈ నెల 31 వరకు భద్రత మాసోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. ఏసీపీ ప్రకాష్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్, అధికారులు రాము, రాజేశ్వరి, యాదయ్య, పాల్గొన్నారు.









క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి


రాజేష్ (ఫైల్)

నస్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-363 సీసీసీలోని సర్వీస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు గడికొప్పుల రాజేష్ (32) మృతి చెందాడు. రాజేష్ అల్లూరి సీతారామరాజు నగర్‌లో నివసిస్తూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గని సివిల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. రాజేష్ శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లికి వెళ్ళి తిరిగి రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా సర్వీస్ రోడ్డుపై వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో పడింది. అక్కడ ఉన్న రాయికి తల తగలడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం ప్రయాణికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. శనివారం తండ్రి ఈసయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

దండేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండే మహేష్ (24) అనే యువకుడు కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం నొప్పి తీవ్రం కావడంతో మహేష్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచా రం ఇచ్చారు. వెంటనే లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో పెద్దపల్లి జిల్లా సుల్తా నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి మెండే పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

బైక్, 102వాహనం ఢీ: ఇద్దరికి గాయాలు

బెజ్జూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేటిగూడ గ్రామసమీపంలోని మూలమలుపు వద్ద శనివారం బైక్, 102 అంబులెన్స్ వాహనం ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తలాయి గ్రామానికి చెందిన పానెం భీమయ్య, ఆత్రం నీలయ్యలు ద్విచక్రవాహనంపై బెజ్జూరుకు వస్తున్నారు. అదే సమయంలో తలాయికి వెళ్తున్న 102అంబులెన్స్ మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం బెజ్జూరు ప్రాథమిక ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తాండూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రెబ్బెన మండలం నగరం కొమురవెల్లి గ్రామానికి చెందిన సాయికిరణ్ అనే యువకుడు బైక్‌పై మండలంలోని గోపాల్‌నగర్ గ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురి బైండోవర్

సిర్పూర్(టి), జనవరి 4(ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా కేసులో పట్టుబడిన సిర్పూర్(టి)కి చెందిన ఐదుగురిని శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. మండలానికి చెందిన అక్కెనపల్లి రాజేందర్, గడ్డం సతీష్, ఎర్ర సారయ్య, మహమ్మద్ అఫ్జల్, తాండ్ర భాస్కర్‌ను బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

నెన్నెల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపేటలో డోలె చిన్నక్క ఇంట్లో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో నిల్వ ఉన్న 25 క్వింటాళ్ల పత్తిలో 10 క్వింటాళ్ల వరకు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగా చుట్టుపక్కల వారు గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. బెల్లంపల్లి ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా వారు చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే నిల్వ ఉన్న పత్తిలో సగం కాలిపోయింది. రూ. 60 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు కుటుంబీకులు వాపోయారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

వ్యక్తికి గాయాలు

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదంపల్లి డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రం వద్ద ఈ నెల 1 లారీపై ఉన్న 6 బస్తాలు రైతు వంగాల నర్సయ్యపై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కాలు, పక్కటెముకలు విరగడంతో వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం కుటుంబీకులు కోరారు.

సెక్షన్ అధికారి సస్పెన్షన్

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల పులుల అభయారణ్యంలోని జన్నారం డివిజన్‌లోని చింతగూడ అటవీ సెక్షన్ అధికారి మధుకర్‌ను కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు అటవీ రేంజ్‌లోని పైడిపెల్లి బీట్‌లో అక్రమ కలప రవాణా జరిగిందని, తదితర అభియోగాలపై సెక్షన్ అధికారిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

వాహనాల వేగానికి స్పీడ్ గన్‌తో కళ్లెం

మంచిర్యాల క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ప్రమాదాల నివారణకు, వాహనాల వేగానికి స్పీడ్‌గన్‌లతో కళ్లెం వేశామని సీపీ శ్రీనివాస్ అన్నారు. 2024లో 7047 కేసులు నమోదు చేసి రూ.72 లక్షల 77వేల445 జరిమానా విధించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై నిర్ణీత వేగంకన్నా మించి వెళ్తే ఫైన్‌తోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో 3082 కేసులను నమోదు చేయగా రూ.31 లక్ష 73 వేల 670 జరిమానా విధించామన్నారు. కమిషనరేట్ ప్రమాదాలు జరిగే 53 ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామని తెలిపారు.

కాలువ మరమ్మతుకు ప్రతిపాదనలు

హాజీపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ర్యాలీవాగు కాలువలకు మరమ్మతు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఇరిగేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కుమార్ తెలిపారు. డిసెంబరు 22న ఆంధ్రజ్యోతిలో ర్యాలీవాగు ప్రాజెక్టు కాలువకు గండి అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 23న గండిపడిన చోటుకు వెళ్లడానికి ప్రయత్నించగా బురదమయంగా ఉండడంతో అధికారులు వెళ్లలేకపోయారు. శనివారం కాలువను పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.






రంగు రంగుల సీతాకోక చిలుకలు

ప్రకృతి పరవశం.. సీతాకోక చిలుకలు

- పెంచికలపేట అడవుల్లో శీతాకాలంలో విరివిగా దర్శనం
- సుమారు 50కి పైగా రకాల సీతాకోకచిలుకలు
- మొక్కల పరాగసంపర్కంలో వీటిదే ప్రముఖపాత్ర



పెంచికలపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట అడవుల్లో పచ్చటిప్రకృతిని రంగులతో కప్పినట్లు కనువిందు చేస్తున్నాయి సీతాకోక చిలుకలు. ఈ అటవీ ప్రాంతం ఎన్నో వింతలు, విశేషాలకు నెలవు. అరుదైన వన్యప్రాణులు, కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన వృక్షశిలాజాలు, పొడుగు ముక్కు రాబందులు నెలవుండే పాలరాపు గుట్ట, సిద్ధేశ్వర గుహలు, జలపాతాలు, వివిధ రకాల పక్షులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. వీటికి తోడు శీతాకాలం నేపథ్యంలో రంగురంగుల సీతాకోక చిలుకలు ప్రకృతి ఒడిలో సందడి చేస్తున్నాయి.

సుమారు 50కి పైగా రకాలు..

గతంలో ఏ పెరట్లో చూసినా అందమైన సీతాకోకచిలుకలు కోకొల్లలుగా దర్శనమిచ్చేవి. పళ్ళ, కూరగాయల చేన్లలో ఎక్కువగా ఇవి దర్శనమిచ్చేవి. ఆయా తోటల్లో మోతాదుకు మించి క్రిమిసంహారక మందుల వాడకంతో సీతాకోకచిలుకల మనుగడపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో ఇవి గ్రామాల్లో కనిపించడం లేదు. ఇక్కడి అటవీ ప్రాంతంలో మాత్రం సుమారుగా 50 పైన రకాల సీతాకోకచిలుకలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా కామన్, మోర్మన్, కామన్ క్రో, జెజిబెల్, ఇండియన్ స్కిప్పర్, బ్లూ మోర్మాన్, ఇండియన్ రెడి ఎడ్మిరల్, ప్లెయిన్ టైగర్, పెంటెడ్ లేడీ, లైమ్ బ్లాటర్‌ఫ్లై, కామన్ గ్రాస్ ఎల్లో, బ్లూమార్క్, మొదలగు 50 రకాలపైనే సీతాకోక చిలుకలు పెంచికలపేట అడవుల్లో ఉన్నాయి.

సీతాకోకచిలుక ప్రాముఖ్యత..

ప్రకృతికే కొత్త అందాన్ని తీసుకొచ్చే సీతాకోక చిలు కలు పర్యావరణ సుస్థిరతలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒకేజాతి సీతాకోకచిలుకల్లో కూడా చాలా తేడాలు ఉంటాయి. ప్రాంతాన్ని బట్టి, రుతువులను బట్టి వాటి రెక్కల్లో అనేక మార్పులు కనిపిస్తాయి. సీతాకోక చిలుకలను పక్షులు తినవు. ఎందుకంటే సీతాకోకచిలుకలు లార్వాదశలో ఉన్నప్పుడు తిన్న విషపూరితమైన ఆకుల ను ప్రౌఢదశ వరకు కూడా శరీరంలోనే ఉంచుకుం టాయి. దీంతో పక్షులకు ఇవి రుచించవు. పొరపాటున తిన్నా పక్షులు ఇబ్బందులు పడతాయి. ముఖ్యంగా సీతాకోక చిలుకలు లేకపోతే మొక్కలలో పరాగ సంపర్కం జరగదు. దీంతో మానవాళికి పండ్లు, కూరగాయలు అందడం కష్ట తరం అవుతుంది.

సీతాకోక చిలుక జీవిత చక్రం..

సీతాకోక చిలుక నాలుగు దశల్లో రూపాంతరం చెందుతుంది. ఇందులో మొదటిది లార్వా దశ. ఇది మొక్క ఆకులను అంటిపెట్టుకొని ఉంటుంది. రెండోది కోశస్థ దశ. ఈ దశలో ఆరు నుంచి ఏడు రోజుల్లో ఒక నిర్మాణం ఏర్పడుతుంది. ఈ దశలో చర్మం చాలా శ్వాసిస్తుంది. దీనినే గొంగళి పురుగు దశ అంటారు. ఆకులను తింటూ తన పరిమాణాన్ని పెంచుకుంటుంది. మూడోది విశ్రాంత దశ లేదా ప్యూపా దశ. ఈ దశలో గొంగలి పురుగు తన చుట్టూ ఒక కోశాన్ని ఏర్పర్చుకుని మొక్కను గట్టిగా అంటిపెట్టుకొని ఉంటుంది. మెల్లిగా మార్పు చెందుతుంది. నాల్గోది ప్రౌఢ దశ. ఈ దశలో తన కోశాన్ని తొలగించుకొని ప్రౌఢ సీతాకోక చిలుక బయటకు వస్తుంది.

కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది..



సీతాకోక చిలుకలు జీవ వైవిధ్యంలో కీలకమైనవి. కొంత కాలం క్రితం ఎక్కడ చూసినా ఇవి విరివిగా కనిపించేవి. ఆ తరువాత వ్యవసాయ రంగంలో విచ్చలవిడిగా పెరిగిన పురుగుల మందుల వాడకం, కాలుష్యం, ప్రకృతి విధ్వంసం వల్ల వాటి మనుగడకు ప్రమాదం ఏర్పడింది. సీతాకోక చిలుకలు చేసే మేలు తెలుసుకుని వాటి ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- అనిల్‌కుమార్, ఎఫ్‌ఆర్వో

న్యూస్ బాక్స్

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బెజ్జూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని కుంటలమానేపల్లి గిరిజన ఆశ్రమపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిపోషణ్ అభియాన్‌లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. అలాగే పదవతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు పరశురాం, వార్డెన్ సునీత తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

వాంకిడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రియాజ్‌అలీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అకిని ప్రాథమికపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులు తాగే మంచినీటిని, భోజనం చేసే పరిసరాలను పరిశీలిం చారు.

విద్యార్థులకు అవగాహన

జైనూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు కళాబృందం శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కాలేజీలో విద్యార్థులకు చదువుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ కీలకమైందన్నారు. విద్యార్థులు చదువుపైనే ధ్యాస పెట్టాలన్నారు. రోడ్డుప్రమాదాలు, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు.

ఆర్టీసీ సేవలను విస్తరిస్తాం: డీఎం

కౌటాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలను విస్తరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తామని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ త్వరలో మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సమయానుసారంగా బస్సులు నడిపిస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత

సిర్పూర్(టి), జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన గోనె శ్రీనివాస్ ఆవు గతంలో పులి దాడిలో మృతిచెందింది. దీంతో అటవీశాఖ ఆధ్వర్యంలో బాధితుడికి శనివారం ఎఫ్‌ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్లు సంతోష్, అరుణ్‌రెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమ్మెకు పూర్తి మద్దతు


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న అంబాల ఓదెలు

కాగజ్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేస్తున్న హమాలి కార్మికులకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు బీఆర్‌ఎస్ నాయకుడు అంబాల ఓదెలు తెలిపారు. శనివారం బీట్‌మార్కెట్‌లో హమాలీల సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీల కూలి రేట్లు కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగులయ్య, బుదాజీ, కుమార్, కిషన్, రాజు, సత్యనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి

- సిర్పూర్(యు)లో 6.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు


సిర్పూర్(యు)లో చలి మంట కాగుతున్న ఆదివాసులు

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో 6.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా తిర్యాణి మండలం గిన్నెధరిలో 6.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణి మండలంలో 7.1డిగ్రీలు, కెరమెరిలో 8.3డిగ్రీలు, కెరమెరి మండలం ధనోరలో 8.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిర్పూర్(యు): మండల కేంద్రంతోపాటు మారుమూల గ్రామాల ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 5నుంచే ఇళ్లలో, వీధుల్లో ఆదివాసీలు చలి మంటలు ఏర్పాటు చేసుకుని ఉపశమనం పొందుతున్నారు.



కలెక్టర్‌ను కలిసిన మందమర్రి జీఎం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను శనివారం మందమర్రి జీఎం దేవేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏరియాలో గనుల విస్తరణకు సంబంధించి అటవీ అనుమతులు, తదితర సమస్యలపై ఆయనతో చర్చించారు. అదే విధంగా మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదనపుకలెక్టర్ సబావత్ మోతీలాల్‌ను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మందమర్రి టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు కార్మికసంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు సమస్యలను ఏకరువు పెట్టారు. రెండున్నర దశాబ్దాల క్రితం దిగిపోయిన కార్మికులకు 500నుంచి 1000పెన్షన్ వస్తోందన్నారు. దీంతో కుటుంబపోషణ కష్టమవుతోందన్నారు. పెన్షన్ పెంపుదలకు, క్వార్టర్లు అద్దెప్రాతిపదికన ఇచ్చేలా చూడాలని తదితర సమస్యలను విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నామిని శంకర్, పోలు సంపత్, జక్కం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన శ్రీరాంపూర్ నాయకులు


సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమసంఘం, ఎస్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్‌రాజేశ్, ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్ సీఎండీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల గురించి మాట్లాడారు. 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఆర్వోఆర్ పదోన్నతులు, జాబితా విడుదల గురించి ప్రస్తావించారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు.

అనుమతి లేకుండా డబ్బుల రికవరీ సరికాదు

మందమర్రి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు సంబంధం లేకుండా గుర్తింపు సంఘం వారి వేతనాల నుంచి గుడి కమిటీ పేరిట డబ్బులు రికవరీ చేయడం సరికాదని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ మండిపడ్డారు. శనివారం ఆయన ఏరియాలోని సీహెచ్‌పీలో కార్మికులను కలిశారు. అనంతరం మాట్లాడుతూ 1850కోడ్ పేరుతో చట్టవ్యతిరేకంగా బలవంతంగా కార్మికుల సంతకాలు లేకుండా గత సంవత్సరం గుడి పేరిట డబ్బులు కట్ చేశారని తెలిపారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పోటీపడి సభ్యత్వాల పేరిట ఈ దందా కొనసాగి స్తున్నారని ఆయన మండిపడ్డారు.

కార్మికుల హక్కులను కాపాడాల్సిన గుర్తింపు సంఘం ఇలా చేయడం ఏంటని అన్నారు. రూ.2కోట్లకు పైగా డబ్బులు రికవరీ అవుతున్నాయని తెలిపారు. దీనిని హెచ్‌ఎంఎస్ ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా కార్మికులు గుర్తింపు సంఘం విధానాలను అర్థం చేసుకొని త్వరలో సింగరేణి వ్యాప్తంగా తాము చేసే పోరాటాల్లో కలిసిరావాలని ఆయన తెలిపారు.

ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సింగరేణి నిధులను వినియోగించాలి

జైపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి నిధులను సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన ఇందారం, రామారావుపేట, టేకుమట్ల గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని శనివారం శ్రీరాంపూర్‌ఏరియా జీఎం సూర్యనారాయణకు ఇందారం మాజీ ఎంపీటీసీ భర్త అరికె సంతోష్‌యాదవ్, రామారావుపేట మాజీఎంపీటీసీ పెద్దల బాపు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రామారావుపేట శివారులోని ఒకవ్యక్తి లాభం కోసం రైసుమిల్లుకు సింగరేణి అధికారులు రూ.95 లక్షలతో బీటీరోడ్డు వేయడానికి టెండర్లు పిలిచారన్నారు. ఇదిపూర్తిగా సింగరేణి నిధులను దుర్వినియోగం చేయడమేనని అన్నారు. ప్రభావిత గ్రామాల్లో సమస్యలను పరిష్కరించకుండా సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఒకవ్యక్తి సొంత ప్రయోజనా కోసం టెండర్లు పిలిచారన్నారు. ఈ టెండర్లను రద్దుచేసినిధులను ప్రభావిత గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని కోరారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించండి

శ్రీరాంపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కార్మికులకు పనిప్రదేశాల్లో వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు కోరారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఎస్‌ఆర్పీ3,3ఏ గనిలో బాయిబాట నిర్వహించారు. అన్నివిభాగాల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని గని మేనేజర్‌ను కోరారు. అనంతరం గనిలో సుదీర్ఘకాలంగా పనిచేసి బదిలీపై సత్తుపల్లి సీహెచ్‌పీకి వెళ్తున్న ఇంజనీర్ సాయిశ్రావణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర ఉపప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, కేంద్ర ప్రధాన కార్యదర్శి మారపల్లి బాపు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

రెబ్బెన, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓసీలో విధులు నిర్వర్తించి మృతిచెందిన జనరల్ మజ్దూర్ జీవీ సత్యనారాయణకు సంబంధించిన ఎఫ్‌డీ ఎమౌంటు రూ.7.50లక్షల చెక్‌ను శనివారం జీఎం శ్రీనివాస్ సత్యనారాయణ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్ తిరుపతి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో ఓసీ ఎం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

తాండూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10 నుంచి 14 వరకు జరగనున్న జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాల విద్యార్థిని స్ఫూర్తికారుణ్య ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని అభినందించి రూ.5 వేల నగదు అందించారు. పోటీల్లో రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరామర్శ

గర్మిళ్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ సుభాబాయ్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యలు శనివారం కుటుంబీకులను పరామర్శించారు.

ఫుడ్ ఫెస్టివల్

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కలమడుగు వివేకానంద పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసుకుని వచ్చారు. ఆహార పదార్థాల ద్వారా కలిగే ప్రోటీన్‌లు, కార్బోహైడ్రేట్ల గురించి తెలియజేసేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సర్వే

దండేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెండు రోజుల నుంచి డిజిటల్ సర్వే కొనసాగుతోంది. అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో అభివృద్ధి కోసం సర్వే చేపడుతున్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని పెద్దపల్లి సభలో సీఎం హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం సర్వేను ఈవో సంకటాల శ్రీని వాస్ ఆధ్వర్యంలో చేపట్టారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

లక్షెట్టిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏసీఎంవో మార్త రాజమౌళి శనివారం తనిఖీ చేశారు. బుధ, శుక్రవారం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మోవలడ్డు (ఇప్పపువ్వు లడ్డు) విద్యార్థులు తినేలా చూడాలన్నారు. బాలికలకు ప్రత్యేకంగా విటమిన్ సీతోపాటు ఫోలిక్‌ఆసిడ్ మాత్రల పంపిణీ తెలుసుకున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే గ్రాండ్ టెస్టు గురించి వివరించారు. సత్యనారాయణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆదివారం అమ్మకు తోడుగా...

- చిన్నారులకు పనులు నేర్పుదాం
- 3 నుంచి 5వ తరగతిలో పాఠ్యాంశం


బూట్లు శుభ్రం చేసుకుంటున్న చిన్నారి

కోటపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సెలవు వస్తే చాలు మా అమ్మాయి సెల్‌ఫోన్‌కే పరిమితం అవుతుంది అని ఓ తల్లి ఆవేదన... బడి నుంచి వచ్చిన చిన్నారులు పుస్తకాల బ్యాగు ఒక చోట, యూనిఫాం మరోచోట పారేస్తారు. కనీసం వాటిని సరుకోరు అంటూ మరో తల్లి ఆవేదన. ఇలాంటి ఘటనలు నిత్యం మన ఇండ్లలో చూస్తూనే ఉన్నాం. ఇంత వరకు బాగానే ఉన్నా వారిని మార్చాల్సింది కొంతలో కొంత పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు. ముఖ్యంగా తల్లి.

ఆదివారం వచ్చిందంటే పిల్లలంతా సెల్‌ఫోన్ పట్టుకుని రోజంతా గడిపేస్తున్నారు. అయితే వాటిని పక్కనపెట్టి అమ్మకు సాయం చేద్దామనే భావన పిల్లల్లో కల్పించాలి. వారిలో మార్పు తీసుకురావాలి. దీనికి వారి ఇష్టాలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు నడుచుకోవాలి. వారు కోరుకున్న వంట వారితోనే చేయించండి. గారాబం ఉండాలి కానీ ఆ గారాబం ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారితే జీవన నైపుణ్యాలు దెబ్బతిని పిల్లల ఉన్నతికి ప్రతిబంధకాలుగా మారుతాయి. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకోసం చిన్నప్పటి నుంచే పిల్లలను మార్చాల్సిన అవసరం ఉంది. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే ఇంటి నిర్వహణలో ఆర్థిక, సాంఘిక, సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వతరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో వీటిని ప్రస్తావించారు. ఈ ఆదివారం నుంచి ఈ అంశాలను ఆచరించడంలో పిల్లలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.


- క్రమశిక్షణ పెరుగుతుంది

సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యతతోపాటు క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదల లాంటి లక్షణాలు అలవడుతాయి. వారిపై వారికి నమ్మకం ఏర్పడుతుంది. సేవా లక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొనేలా అవకాశం ఉంటుంది. ఇంట్లో అందరు పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి ఉంటున్నామని భావన పెరగడంతోపాటు సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. అంతేకాకుండా ఒత్తిడి, కృంగుబాటు, ఆందోళన లాంటి అంశాలు దరిచేరవు. అందుకోసమే ఆదివారం అమ్మకు తోడుగా కాస్తో కూస్తో పనులు చేయించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా తల్లిదండ్రుల్లో మార్పు వచ్చినప్పుడే విద్యార్థులు సోమరితనానికి దూరంగా ఉంటారు.

- పని విద్య పుస్తకంలో నిర్దేశించిన అంశాలు

3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాలను పరిశీలించి వాటి ద్వారా పిల్లలతో ఇంటి పనులు చేయించాలి. ఇంటి పనులు ఇలా..

- ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపర్చడం,
- విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సలహామేరకు పక్కన పెట్టడం
- చెప్పులు, బూట్లను శుభ్రం చేసి వరుస క్రమంలో పెట్టడం
- ఇంటి సరుకులు తీసుకురావడంలో సహాయం చేయడం
- ఇల్లు శుభ్రం చేయడం, నీళ్ల పట్టడం, వంట చేయడంలో సహకరించడం
- భోజనవేళలో తాగునీరు ఏర్పాటు చేయడం
- మొక్కలకు నీరు పట్టడం, ఎరువులు వేయడం లాంటి పనులను పిల్లలకు నేర్పించాలి.


సెల్‌ఫోన్ చూస్తున్న చిన్నారి

తల్లిదండ్రులదే బాధ్యత



ఇంట్లో చిన్నారులతో పనులు చేయించడం తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలి. చిన్న చిన్న పనులు చెబుతూ వారికి బాధ్యతలను గుర్తు చేయాలి. ఏ పని చేస్తున్నా బాగుంది, ఇంకా మెరుగ్గా చేయగలవు అంటూ ప్రోత్సహించాలి. వారి భాగస్వామ్యం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. పిల్లలను ప్రేమించడంతో పాటు వారిలో సోమరితనం పోగొట్టి పనులను నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

- రాజశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

నైతిక విలువలు పెరుగుతాయి



పిల్లలకు తరుచూ ఇంటి పనులు ఇవ్వడం, బాధ్యతలు గుర్తు చేయడం వల్ల పిల్లల్లో నైతిక విలు వలు పెరుగుతాయి. ప్రాథమిక స్థాయిలో 3నుంచి 5వ తరగతులకు పని విద్య సహ పాఠ్యాంశాలు చెప్పడం వల్ల వారిలో క్రమశిక్షణ లాంటి లక్షణాలు అలవడతాయి. ఫలితంగా సేవా లక్షణాలు సైతం మెరుగు పడతాయి.

- కోమట్ల బాపు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, బావనపల్లి

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

5వపేజీ తరువాయి

ఆయా జాబితాలో ఉన్న వారి పేర్లను పరిశీలించి అర్హులా, కాదా అనే విషయాన్ని నిర్ధారించిన తరువాత అర్హులకు ఇళ్లను మంజూరు చేయనున్నారు.

స్థలాలు ఉన్న వారికి రెండో విడుతలో

ఇంటి నిర్మాణానికి అనువైన స్థలం ఉండి ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ పథకం రెండో విడుతలో ఎంపిక చేయనున్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందజేస్తారు. బేస్మెంట్ మొదలు కొని స్లాబ్, తదితర పనులను బట్టి నిర్ణయించిన నగదును విడుతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఆర్థికంగా మెరుగ్గా ఉన్న వారు ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షలకు మరింత సొమ్మును కలిపి ఇళ్లను తమ ఆలోచనా విధానాలకు అనుగుణంగా నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించారు.

కొనసాగుతున్న సర్వే

బెల్లంపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇండ్ల కోసం 388 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా వారి ఇండ్లకు వెళ్లి వివరాలను నమోదు చేశారు. వార్డు ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శివశంకర్, సమత్, శ్రీనివాస్, నాయకులు మల్లేష్, కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

గర్మిళ్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం, నర్సింగ్ కాలేజీలో శనివారం టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి 30 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వం అందజేశారు. రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, పద్మలత, గోపాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వంద కోట్లతో అభివృద్ధి పనులు


చెన్నూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఇందారం అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గంలో వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు మంచినీటి సరఫరా కోసం చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో వంద కోట్లతో అమృత్ పథకం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. చెన్నూరు మున్సిపాలిటీలో 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించేందుకు మంత్రి దామోదర రాజనర్సింహాను కలిశామన్నారు. నియోజకవర్గంలో అక్రమ దందాలను అరికట్టానన్నారు. బావురావుపేటలో రూ.1.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఇందారం, ముదిగుంట గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని, అయినప్పటికీ తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన కుంభకోణాలకు నిలయంగా మారిందని, ఈ ఫార్ములా రేస్ అడ్వాన్స్‌గా చెల్లింపు జరిగిందనేది వాస్తవం కాదా అన్నారు. తప్పు చేయనప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. చెన్నూరు నియోజకవర్గంలో వంద కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. తక్కువ టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న వారు నాణ్యతతో పనులు చేయకుంటే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు సుదర్శన్, ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాలలంతా ఏకతాటిపై ఉండాలని, సంఘం పటిష్టత చాటాలని తెలిపారు. దాసరి రాములు, గజెల్లి లక్ష్మణ్, పైడిమల్ల నర్సింగ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే తేజ ల్యాబ్‌తో పాటు వివిధ సంస్థలకు చెందిన క్యాలెండర్లను ఆవిష్కరించారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆవడం క్రాస్‌రోడ్డు వద్ద డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతోపాటు మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి కృషి చేస్తానన్నారు. వర్షాకాలంలో కాలనీలోకి నీరు చేరుతుందని మహిళలు విన్నవించగా డ్రైనేజీ ఏర్పాటు చేసి నీరు రాకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. భీమారం, మద్దికల్, కొత్తపల్లిలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 40 లక్షల వ్యయంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. చేకుర్తి సత్యనారాయణరెడ్డి,మోహన్‌రెడ్డి, పోడేటి రవి, గద్దె రాంరెడ్డి, లక్ష్మణ్, భాస్కర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి


నర్సరీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

వేమనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. శనివారం నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే హరితహారం కోసం మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో మునగ, వెదురు, ఈత, తాడి, నీలగిరి మొక్కలను పెంచాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఫాంపాండ్ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రూ.300 గరిష్ట వేతనం పొందాలని, ప్రతీ జాబ్ కార్డుదారుడు వంద రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు. ముల్కలపేట గ్రామపంచాయతీలో ఇందిరాక్రాంతి పథకంలో మంజూరైన ఊరకోళ్ల పెంపకాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఈసీ మధుకర్, కార్యదర్శులు అశోక్, జాపర్, పాల్గొన్నారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. శనివారం మల్లంపేట, సర్వాయిపేట గ్రామాల్లో నర్సరీలు, పశువుల పాకల పనులను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కల ఎదుగుదలకు చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మయ్య, ఏపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

హాజీపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు, డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం వేంపల్లిలో వాహనాలను ఆపి డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. రోడ్డు భద్రత స్టిక్కర్లను వాహనాలకు అంటించారు. ఇన్‌స్పెక్టర్‌లు రంజిత్, కిశోర్, ఖాసీం, సూర్యతేజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నస్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. హక్కుల సాధనకు ఆందోళన కొనసాగిస్తామని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు వెల్లడించారు. శిబిరాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు స్రవంతి, శ్రీనివాస్, దీపరాణి, దివ్యాంగ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రమేష్, కోశాధికారి దేవేందర్, రాజయ్య తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.

హమాలీ కార్మికుల సమ్మె

నస్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల హక్కుల సాధనకు నస్పూర్‌లోని సివిల్ సప్లయి గోదాం (ఎంఎల్ఎస్-పాయింట్) ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకు చేరింది. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి సత్యనారాయణ, నాయకులు సంపత్, చంద్రయ్య, రాజ్‌కుమార్, హరీష్, తిరుపతి, సాగర్, సాయి, కుమార్, రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఐఏపీపీటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాల క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ జోబిన్ తెలిపారు. నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ (ఎన్ఎస్ఈ) నిర్వహించిన పరీక్షలో నలుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిని అభినందించారు. మంచిర్యాలకు చెందిన రోహిణి, మామిడి మన్విత్ ప్రతిభ కనబరిచారన్నారు. పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అరవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

లక్షెట్టిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బోడకుంట మహేష్ అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు జెండవెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణం తీసుకోగా అధికారులు బీమా చేశారు. దీంతో అతడికి మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును శనివారం పట్టణంలోని జెండవెంకటాపూర్ సహకార సంఘ కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాసు సురేష్, డైరెక్టర్ కాంద్రపు సత్తయ్య, మేనేజర్ పంకజ్, సీఈవో విష్ణువర్ధన్ రావు, మృతుడి కుటుంబ సభ్యుడు రమేష్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మిస్టర్ ప్రైస్ జట్టు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా మిస్టర్ ఫ్రైస్ జట్టు నిలిచింది. డిసెంబరు 25న రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌కు సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి హాజరై ప్రారంభించారు. విజేత మిస్టర్ ఫ్రైస్ జట్టుకు ట్రోఫీ, రూ. 15 వేల నగదు, రన్నర్ జట్టు సతీష్ స్మాషర్స్ జట్టుకు రూ.7,500 నగదు, ట్రోఫీ అందించారు. వెంకటేశ్వర్‌రావు, రజనీష్‌జైన్, అశోక్, ముకేష్‌గౌడ్, కృష్ణమూర్తి, రమణరావు పాల్గొన్నారు.

వైకల్యాన్ని అధిగమించి విజయం సాధించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధులు తమ వైకల్యాన్ని అధిగమించి తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధికారులు రౌఫ్‌ఖాన్, దుర్గా ప్రసాద్, కీర్తి రాజీవీరులతో కలిసి హాజరై కేక్ కట్ చేశారు. లూయిస్ బ్రెయిలీ అంధులకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎఫ్ఆర్‌వో ఫర్హానాబేగం, డీసీపీవో ఆనంద్ పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు బోలిశెట్టి బుచ్చన్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కాసిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గురువాపూర్ శివారులోని భూములను పట్టా చేసుకుని కాస్తులో ఉన్న తమపై దాడులకు పాల్పడుతున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో బాధితులు కుర్సెంగ మోహన్, కేశవరావులు మాట్లాడారు. భూములను ఈర్ల సుధాకర్, ఇనగంటి సత్యనారాయణలు గురువాపూర్ శివారులోని 74/1, 74/2 సర్వే నెంబర్లలోని 58 ఎకరాల భూమిని అక్రమంగా పట్టాలు చేసుకున్నారన్నారు. అధికారులు స్పందించి అక్రమ పట్టా దారులను తొలగించి అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రైతులు ఆత్రం మహాదు, ఆడె నగేష్ పాల్గొన్నారు.

మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలి


సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ పార్టీ పోలీసులకు సీపీ శ్రీనివాస్ సూచించారు. శనివారం కమిషనరేట్‌లో స్పెషల్ పార్టీ సిబ్బందికి గ్రేహౌండ్స్ తరహా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. ఫిజికల్ ఫిట్‌నెస్, స్క్వాడ్ డ్రిల్, ఆయుధ వినియోగం, ఆర్మ్‌డ్ డ్రిల్, ఫాట్స్ నేమ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణను సిబ్బంది శ్రద్ధతో వినియోగించుకోవాలని, శిక్షణ సమయంలో ప్రతిభ కనబర్చినవారికి అవార్డులను ఇస్తామన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, సంపత్, మల్లేషం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్ష పడితేనే నేరాలు తగ్గుతాయి

నేరస్థులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను పోలీసులు ఎస్కార్ట్ ద్వారా జాగ్రత్తలు పాటిస్తూ తీసుకురావాలని, నేరస్థులకు శిక్ష పడే విధంగా సాక్ష్యులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సీపీ సూచించారు. క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండే విధంగా షెడ్యూల్ ప్రకారం సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టాలన్నారు. నేరస్థులకు వారెంట్స్, సమన్లు సత్వరమే ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. అదనపు డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు సుందర్‌రావు, ప్రసాద్, పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు గూడెం నీటి విడుదల

దండేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి సాగు నీటిని ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. డి30 నుంచి డి42 వరకు యాసంగిలో మూడు మండలాల పరిధి ఆయకట్టు సాగు నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంట మనిషిని తొలగించాలి

మంచిర్యాల క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) మంచిర్యాల పట్టణం అండాలమ్మ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట మనిషి బత్తుల పద్మను తొలగించి ఆమెపై చర్యలు తీసుకోవాలని శనివారం డీఈవో యాదయ్యకు మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పద్మ విద్యార్థులకు సరియైన భోజనాన్ని అందించడం లేదని, తల్లిదండ్రులు అడుగగా వారిని దుర్భాషలాడుతోందని తెలిపారు. సొంత నివాసానికి పాఠశాల విద్యుత్‌ను వాడుకునేందుకు గోడను సైతం తీసివేసిందని తెలిపారు. మానస, తిరుపతి, ఎండి ఖలీద్, తదితరులు పాల్గొన్నారు.


పక్షులపై అవగాహన

వేమనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయి అటవీ ప్రాంతంలో శనివారం అటవీ శాఖ సిబ్బందికి, అధికారులకు రీసోర్స్‌పర్సన్ రంజాన్‌హిరానీ పక్షులపై అవగాహన కల్పించారు. కెమెరాలతో పక్షులను వీక్షించారు. పక్షులు, వాటి వివరాలను సిబ్బందికి తెలిపారు. ఎఫ్ఆర్‌వోలు అప్పలకొండ, శివకుమార్, చెన్నూరు డివిజన్ ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

బర్డ్‌వాచ్, వాక్‌కు ఏర్పాట్లు

జన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం నిర్వహించే బర్డ్‌వాచ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. 15 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఆదివారం తెల్లవారుజామున బైసన్‌కుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో పక్షులను వీక్షించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు రేంజ్ పరిధిలోని భీమారం గొల్లవాగు ప్రాజెక్టు నుంచి చెన్నూరు కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్‌పార్కు వరకు ఆదివారం బర్డ్‌వాక్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెన్నూరు ఫారెస్టు రేంజ్ అధికారి శివకుమార్ తెలిపారు. ఉదయం ప్రారంభమై సాయంత్రంతో ముగుస్తుందన్నారు. శనివారం పది మంది సందర్శకులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు.





ఐదు నెలలుగా వేతనాల్లేవ్!

ఇబ్బందులు పడుతున్న అతిథి అధ్యాపకులు

వాంకిడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఒక నెల వేతనం ఆలస్యమైతేనే ఇంటి నిర్వహణ ఖర్చులు, నెలవారీ చెల్లింపులు(ఈఎంఐ) ఆలస్యమై ఇబ్బందులు పడతాం. అదే నెలల తరబడి వేతనాలు రాకుంటే పరిస్థితి ఎలాం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఐదు నెలలుగా వేతనాలు అందడంలేదు. ప్రభుత్వ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వీరి వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో 61మంది అధ్యాపకులు..

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఇందులో రగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ అధ్యాపక పోస్టులను ప్రభుత్వం భర్తీ చేపట్టకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అతిథి అధ్యాపకులను నియమించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్న చోట అన్ని కళాశాలల్లో మొత్తం 61మంది ఒప్పంద, అతిథి అధ్యాపకులను ప్రభుత్వం నియమించింది. ఈ ఏడాది జూన్‌లో వారిని రెన్యువల్ చేసింది. ప్రతీ పీరియడ్‌కు రూ.390చొప్పున నెలకు 72పీరియడ్‌లకు రూ.28,080కి మించకుండా వేతనం చెల్లించారు. జూన్, జూలై రెండు నెలల వేతనం చెల్లించారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలు అంటే ఐదు నెలల జీతం ఇంతవరకు విడుదల చేయలేదు. నెలకు రూ.28,080అని చెపుతున్నా.. ఒక నెలలో సెలవులు ఎక్కువగా ఉన్నా లేదా అనారోగ్యం, ఇతర పనులతో విధులకు హాజరు కాకున్నా వాటికి వేతనం కట్ చేస్తున్నారు. వచ్చే డబ్బులను కూడా నెలనెలా ఇవ్వకుంటే తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

- జీ సత్తయ్య, అతిథి అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల - వాంకిడి



నాలుగు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. వెంటనే వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలి.

ఎంపీ కృష్ణయ్యను సన్మానించిన 'అరిగెల'

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజ్యసభసభ్యుడు, బీసీసంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీసీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనసంవత్సర శుభకాంక్షలు తెలియజేసి జిల్లాలో నెలకొన్నపరిస్థితులపై చర్చించారు.

కొనుగోలు కేంద్రాలు మూసివేత

దహెగాం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరివెల్లి, చంద్రపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మూసివేసినట్లు కార్యదర్శి నారాయణ తెలిపారు. మండలంలోని ఒడ్డుగూడ, లగ్గాం, అయినం, కుంచవెల్లి, హత్తిని కొనుగోలు కేంద్రాలను కూడా త్వరలోనే మూసి వేస్తామన్నారు. రైతులు తమ వద్ద ధాన్యం ఉంటే త్వరగా అమ్ముకోవాలన్నారు.

దుప్పట్లు పంపిణీ

బెజ్జూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బాయి, హేటిగూడ గ్రామాల్లో శనివారం ఎఫ్‌డీవో సుశాంత్ సుఖదేవ్ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేరోజుల్లో ఇప్పపువ్వు సేకరణలో గిరిజనులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడవిలో పులి సంచరిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని వాటికి ఎలాంటి ముప్పుడు తలపెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో రేంజ్‌అధికారి అబ్దుల్ ముసావీర్, డిప్యూటీరేంజ్ అధికారి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వేగవంతం చేయాలి

జైనూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కాంప్లెక్స్ గదుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిజామాబాద్ మార్కెటింగ్ సర్కిల్‌ఈఈ గణేష్ అన్నారు. మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న మార్కెటింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నాణ్యంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్, సిబ్బంది ఉన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి: ఎస్సై

బెజ్జూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామంలో తాలూకాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో యువత క్రీడలపై ఆసక్తికలిగి ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రవి, జాయిద్ హుస్సేన్, నిర్వాహకుడు తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

- రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, పోలీసుకమిషనర్లు, రవాణా శాఖాధికారులు, ఆర్టీసీఅధికారులు, విద్యాశాఖ అధికారులతో రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల31వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రహదారి భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో రోడ్డుభద్రతపై అవగాహనకేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత మాసోత్సవాలను సంబంధిత అధికారుల సమన్వయంతో జిల్లాలో కొనసాగిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే 45ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైనచర్యలు చేపడతామన్నారు. మూలమలుపు, వేగనిరోధకాలు, ఇతరప్రాంతాల్లో సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖఅధికారి రాంచందర్, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, రోడ్లు భవనాల శాఖాధికారి సురేం దర్, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యుల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

పేదల కోసం పోరాటం చేసిన బావండ్లపల్లి కనుకన్న

కాగజ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం బావండ్లపల్లి కనుకన్న 30వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం భారత రైతుకూలీసంఘం జిల్లా కన్వీనర్ రత్నం హోసన్న, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా మాట్లాడుతూ కనుకన్న నిరూపేదల కోసం ఎనలేని పోరాటం చేశాడన్నారు. రాష్ట్ర నాయకుడు లాల్‌కుమార్ మాట్లాడుతూ కనుకన్న ప్రజాస్వామిక పోరాటాలు చేశాడన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర నాయకులు టి శ్రీనివాస్, జిల్లా నాయకులు బండారు తిరుపతి, ప్రసాద్, పీడీఎస్‌యూటీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు లెనిన్, రాధ, వేణు, రవి, కృష్ణ, శ్యాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మంత్రిని కలిసిన యువకులు

దహెగాం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మండలకేంద్రానికిచెందిన యువకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా దహెగాం-కోత్మీర్ డబుల్‌రోడ్డు నిర్మాణపనులు పూర్తిచేయాలని, కల్వాడ-దహెగాం గ్రామాల మధ్య కల్వర్టులను నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేష్ దోత్రేను శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్‌అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు అహ్మద్, నిసార్, తిరుపతి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

ఆసిఫాబాద్‌రూరల్: వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన మనోహర్‌కు రూ.42వేలు, చిన్నబాయికి రూ.20వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి వారికి అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువండి



రక్తదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ, ట్రస్ట్ సభ్యులు

కౌటాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని జగద్గురు నరేంద్రబాబా ట్రస్ట్‌సభ్యుడు దిలీప్‌గైక్వాడ్ అన్నారు. మండల కేంద్రంలోని మన్నెవార్ సేవాసంఘం భవనంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన, సీఐ ముత్యం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు దిలీప్‌గైక్వాడ్ మాట్లాడుతూ జగద్గురు నరేంద్ర మహారాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నోసేవా కార్యక్రమాలు నడుస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం లక్ష యూనిట్ల రక్తం సేకరించి 50వేలు ఇండియన్ ఆర్మీకి, 50వేలు ప్రభుత్వానికి అందజేస్తున్నామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా తెలంగాణలోని జుక్కన్ ప్రాంతంలో 57అంబులెన్స్‌లు నడుస్తున్నాయన్నారు. త్వరలోనే తెలంగాణ అంతటా విస్తరిస్తామన్నారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో జగద్గురు నరేంద్ర మహారాజ్ పాదుక దర్శణం ఉంటుందన్నారు. 60మంది రక్తదాన్ని దానం చేయగా జీవనధార బ్లడ్‌బ్యాంకు రాజేష్‌బాబు, రఘువీర్ పాల్గొన్నారు. అలాగే నరేంద్రబాబాట్రస్ట్ నుంచి బాలాజీ, పండరీ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్సీ కవిత రాక

వాంకిడి/జైనూర్/సిర్పూర్(యు), జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌పార్టీ నాయకురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత ఈనెల6న వాంకిడి, జైనూరు మండలాలకు వస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, జైనూరు మాజీఎంపీపీ చిర్లే లక్ష్మణ్ వేర్వేరుగా తెలిపారు. శనివారం ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాంకిడి మండలంలోని దాబా గ్రామానికి చెందిన గిరిజన ఆశ్రమపాఠశాల విద్యార్థిని శైలజ ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శి స్తారన్నారు. జైనూరులో ఇటీవల హత్యాచారయత్నానికి గురైన బాధితురాలు నీలాబాయిని ఉషేగాంలోని దేవుగూడలో పరామర్శిస్తారన్నారు. సిర్పూర్(యు)లో బీఆర్ఎస్ పార్టీ మండలాధక్షుడు తోడ్సం ధర్మారావ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

టీఎస్‌పీఆర్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

వాంకిడి/కౌటాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వాంకిడి, కౌటాల మండల కేంద్రాల్లోని ఉన్నతపాఠశాలలో శనివారం టీఎస్‌పీఆర్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ నటరాజ్, ఆ సంఘంనాయకులు ఖాదర్, గిర్, విద్యాసాగర్, కౌటాలలో నాయకులు నరసింహా చారి, నారాయణసింగ్, ఎంఎల్‌రాజు, గణపతి, పురుషోత్తం, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్..

చింతలమానేపల్లి: మండలవిద్యాధికారి జయరాజు శనివారం టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ గౌడ్, విఘ్నేష్, రాకేష్, సరిచన్, రాజన్న, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంక్షేమానికి కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గ్రామంలో రైతువేదిక వద్ద గల అంగన్‌వాడీకేంద్రాన్ని జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి సందర్శించారు. కేంద్రంలో సదుపాయాలు, పరిసరాలు, ఆహారసామాగ్రి నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీకేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతరమౌళిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిసంక్షేమంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గర్భిణులు తమ వివరాలను సమీప ప్రాథమికఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు చేసుకుని సమయానుసారంగా వైద్యపరీక్షలు నిర్వహించుకునే విధంగా చూడాలన్నారు. వారు సమయానికి మందులు, పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఈ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సీడీపీఏ సదియ, ఏపీవో చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కాగజ్‌నగర్: రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలను ఆయన, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు విద్యార్థులంతా సన్నద్ధం కావాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనం తదితరాలను పరిశీలించారు.



కాగజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

నేడు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ



ఎస్పీఎం క్లబ్‌లో చేస్తున్న ఏర్పాట్లు

కాగజ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగజ్‌నగర్ ఎస్పీఎం క్లబ్‌లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి ముత్యాల ముగ్గుల పోటీలు జరుగనున్నాయి. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)... సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తోంది. స్థానిక స్పాన్సర్లుగా ఎస్పీఎం పేపర్ మిల్లు, అరుణా సర్వీసెస్ ఫ్రాంచాయిస్, ఈ డిజిటల్ సువిధా సెంటర్ స్టోర్స్ సర్‌సిల్క్ వారు తమ సహకారాన్ని అందిస్తున్నారు. పోటీలో మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండో బహుమతిగా రూ.4వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు నగదు పురస్కారం ఇవ్వనున్నారు. విజేతలకు కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎస్పీఎం జీఎం ఎంఎస్ గిరి, చీఫ్ మేనేజర్ ఆర్ రమేష్ రావు బహుమతులను అందజేయనున్నారు. జిల్లాస్థాయి నుంచి ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్, పీడీ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమబాలుర గురుకుల పాఠశాలకు చెందిన నికోడే రవి ఎంపి కైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి, పీడీ శంకర్ తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా తృతీయస్థానంసాధించింది. ఇందులో రవి ఉత్తమప్రతిభ కనబరిచాడన్నారు. విద్యార్థిఎంపికపై ప్రిన్సిపాల్ యాద గిరి, వైస్‌ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, పీడీ సట్ల శంకర్, పీఈటీ ప్రసాద్, ఎస్జీఎఫ్ జిల్లాకార్యదర్శి వెంకటేశం తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభా పరీక్షకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జన్కాపూర్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షకు ఎంపికైనట్లు హెచ్ఎం ఉదయ్‌బాబు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వఉన్నతపాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభాపరీక్షలో తెలుగువిభాగంలో శ్రీనివాస్ ప్రథమ, శంకర్ ద్వితీయ, ఇంగ్లీష్ విభాగంలో మరియాదాస్ ద్వితీయ బహుమతులను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎంపిక కావడంలో గైడ్ టీచర్ విజేష్, హాస్టల్‌వార్డెన్ కృష్ణప్రసాద్ కృషిని అభినందించారు.

పార్ట్‌టైం స్వీపర్లకు వేతనాలు పెంచాలి



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు జిల్లా గ్రంథాలయశాఖలో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా స్వీపర్లుగా కొనసాగుతున్నప్పటికీ తమకుకేవలం రూ.6వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈ వేతనంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని అర్హతనుబట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్‌టైం స్వీపర్లు సయ్యద్‌సలీం, గోపి, అరుణ, ప్రేంసాగర్, బుచ్చన్న, రాజన్న, రామయ్య, అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఆసిఫాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని జిల్లా రవాణాశాఖాధికారి రాంచందర్ నాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహనం నడిపే ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ మోహన్, ఏఎంవీఐ రాజమల్లు, ఏవో అరుణ, సిబ్బంది వినిల్, రజిత, వాజీద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన..

పెంచికలపేట: డ్రైవర్లు రహదారి నియమాలు పాటించాలని ఎస్సై కొమురయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఆటో డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానచౌరస్తాలో వాహనాలు పార్కింగ్ చేసేటప్పుడు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనపత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం



మానవహారంగా ఏర్పడిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తమడిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నాటికి 26వ రోజుకు చేరుకోగా మానవహారం నిర్వహించి బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు మోహన్, తుకారాం, నాగసుధ, రమణ, నాగేష్, సంతోష్, పవన్‌కుమార్, సందీప్, అరుణ, మీన, కవిత తదితరులు పాల్గొన్నారు.